నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, బుధవారం 21 ఆగస్టు 2024 | SIDDIPET

# బెజ్జంకిలో రైతుల ఆందోళన

సిద్దిపేట జిల్లా బెజ్జంకి రైతు వేదికలో జిల్లా వ్యవసాయాధికారి మహేశ్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

బెజ్జంకి, ఆగస్టు 20: పంట రుణాలు మాఫీ కాలేదని మంగళవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద రైతులు ఆందోళన చేశారు. స్థానిక రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటల సస్యరక్షణ కోసం చేపట్టే రైతు నేస్త కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారి మహేశ్ రాగా, రైతులు పెద్ద ఎత్తున బ్యాంకు స్టేట్ మెంట్లతో వచ్చి కార్యక్రమం వద్ద అధికారితో మాకు అర్హత ఉన్న రుణమాఫీ ఎందుకు కాలేదని వాగ్వాదానికి దిగారు. రూ.2 లక్షల కన్నా తక్కువగా ఉన్న రుణమాఫీ కాలేదని రైతులు గోడువెల్ల బోసుకున్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మహేశ్ రైతులతో మాట్లాడి, ఫిర్యాదులను కార్యాలయంలో అందించాలని, పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు ఇంటి వద్ద వచ్చి వివరాలు సేకరిస్తారని వివరించారు.

**ఇండియన్ బ్యాంకు మూసి తాళం వేసి నిరసన**

తోటపల్లిలోని ఇండియన్ బ్యాంకు బ్రాంచ్‌ను రైతులు మూసి తాళం వేసి నిరసన తెలిపారు. బ్యాంకు సిబ్బంది సరైన సమాధానం చెప్పకపోవడంతో అధికారుల, సిబ్బందిని బయటకు పంపి తాళం వేసి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న లీడ్‌బ్యాంకు మేనేజర్ వచ్చి రైతులతో మాట్లాడి 800 మంది రైతుల వివరాలతో కూడిన జాబితా పంపించామని, ప్రత్యేక విచారణలో రైతులకు న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి రుణమాఫీ చేయకుంటే ఉద్యమం చేస్తామని రైతుల హెచ్చరించారు.

# రుణమాఫీ కోసం బారులుదీరిన రైతులు



సిద్దిపేట జిల్లా మద్దూరులో పంటరుణమాఫీపై ఫిర్యాదులు చేసేందుకు బారులుదీరిన రైతులు

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 20: రూ. 2 లక్షల్లోపు పంట రుణాలు మాఫీ కాని రైతుల నుంచి మద్దూరులోని రైతు వేదికలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదు చేసేందుకు గ్రామాల నుంచి రైతులు వచ్చారు. ఏవో రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణాలు మాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

## రేషన్‌కార్డు లేదని లోన్ మాఫీ చెయ్యలే

నాకు మా తండాల 3.20 ఎకరాల భూమి ఉంది. బ్యాంక్‌లో రూ.1.57 లక్షల క్రాప్‌లోన్ తీసుకున్న. రూ.2లక్షల వరకు లోన్ మొత్తం మాఫీ చేసినమని సర్కారోళ్లు చెబుతున్నరు. మరి నా లోన్ ఎందుకు మాఫీ కాలేదని అధికారులను అడిగితే రేషన్ కార్డు లేకపోవడంతో మాఫీ కాలేదని చెబుతుండ్రు. ఇదెక్కడి అన్యాయం. లోన్‌కు రేషన్‌కార్డుకు ఏం సంబంధం. గిట్లయితే రైతులు ఇబ్బంది పడ్తరు. మల్ల ఇప్పుడేమో లోన్ రానోల్లను మల్ల దరఖాస్తు పెట్టుకోండ్రని చెబుతుండ్రు. లోన్ మాఫీ కోసం అటూ బ్యాంక్, ఇటూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నం.

–నాగావత్ పంత్‌నాయక్, శిబ్బితండా, ధూళిమిట్ట మండలం, సిద్దిపేట జిల్లా

# రుణమాఫీపై ఫిర్యాదుల వెల్లువ

సంగారెడ్డి జిల్లా కోహీర్ రైతు వేదికలో వ్యవసాయాధికారులకు దరఖాస్తులు చేసుకుంటున్న రైతులు

కోహీర్, ఆగస్టు 20: పంట రుణమాఫీపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లోని రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారుల హాజరు కాగా, పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమకు రుణ మాఫీ వర్తింస్తుందా లేదా అని అధికారులతో మొర పెట్టుకొన్నారు. రెండు లక్షల రూపాయల కంటే తక్కువ అప్పు తీసుకున్నా తమకు రుణమాఫీ కాలేదని చాలామంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు లక్షల రూపాయలకు పైగా తీసుకున్న రైతుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. దీంతో వ్యవసాయ శాఖ డివిజన్ అధికారి భిక్షపతి స్పందించి.. రేషన్ కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాసు పుస్తకం పత్రాలతో ఏఈవోల వద్ద దరఖాస్తు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో నవీన్‌కుమార్, ఏఈవోలు శ్రీనివాస్, మానికవర్మ, సంధ్య, వేదవతి, సవిత, స్వాతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## రుణమాఫీ ఎందుకు కాలేదు....

నాకు వెంకటాపూర్‌లో 5.8 ఎకరాలు ఉంది. కవేలిలోని కెనరా బ్యాంకులో నాకు రూ.1.90లక్షల క్రాప్‌లోన్ ఉంది. రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ అవుతుందని చెప్పడంతో బ్యాంకు వచ్చి చూసే సరికి రుణ మాఫీ లిస్టులో నాపేరు లేదు. ఎప్పటికప్పుడు రెన్యువల్ చేస్తున్నాను. అయినా నాకు రుణమాపీ చేయలేదు. ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి..?

–ఉప్పరి నర్సింహులు, రైతు, కోహీర్ మండలం, సంగారెడ్డి జిల్లా

# 13 మందికి ఏఆర్ ఎస్సైలుగా ప్రమోషన్

సంగారెడ్డి, ఆగస్టు 20 : జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న పలువురికి ఏఆర్ ఎస్సైలుగా ప్రమోషన్ కల్పిస్తూ ఎస్పీ రూపేశ్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం పీఎస్ కార్యాలయంలో మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు ఎస్పీ వెల్లడించారు. వీరితో పాటు 31మంది ఏఆర్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ కల్పించారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్, రోబోటిక్ ల్యాబ్ ఏర్పాటుపై కలెక్టర్ మనుచౌదరితో కలిసి చర్చిస్తున్న మంత్రి పొన్నం

# రుణమాఫీ కాలేదంటూ రైతుల నిరసన

కంగ్టి మండలం సర్దార్‌తండాలో నిరసన తెలుపుతున్న రైతులు

కంగ్టి, ఆగస్టు 20: తమకు రుణమాఫీ కాలేదంటూ కంగ్టి మండలం సర్దార్ తండాకు చెందిన రైతులు మంగళవారం తెలంగాణ ఉద్యమకారుడు సంజీవ్ ఆధ్వర్యంలో తండాలో నిరసన వ్యక్తం చేశారు. రూ.లక్ష నుంచి 2లక్షల వరకు రుణాలు ఉన్న చాలామంది రైతులకు రుణమాఫీ వర్తించలేదన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే ఆందోళనలు చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు.

# లెక్క తేల్చాల్సిందే!

- నేటి నుంచి పల్లె పల్లెకు బీఆర్ఎస్
- ఇంటింటికీ వెళ్లి పంటరుణమాఫీ వివరాల సేకరణకు నిర్ణయం
- సిద్దిపేట సమావేశంలో కార్యాచరణ ఖరారు
- సన్నాహక సమావేశానికి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సంపూర్ణ పంటరుణమాఫీ కార్యాచరణ సమావేశానికి హాజరైన ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు

సిద్దిపేట, ఆగస్టు 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అరకొర రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మొండిచెయ్యి చూపింది. విడతల వారీగా మూడు విడతల్లో రైతులందరీ రుణమాఫీ చేశామని సీఎం నుంచి మంత్రుల వరకు గొప్పలు చెప్పకుంటూ సంబురాలు చేసుకుంటున్నారు. కానీ, పరిస్థితి వేరేలా ఉంది. సగం మంది రైతులకు రుణమాఫీ వర్తించక పోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా 50శాతం రుణాలు మాఫీ కాలేదు. రైతులు తమకు రుణమాఫీ కాలేదని బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కనీసం అధికారిక జాబితా విడుదల చేయలేని దుస్థితిలో అటు బ్యాంకర్లు, ఇటు వ్యవసాయ అధికారులు ఉన్నారు. గ్రీవెన్స్ సెల్‌కు రైతులు ఫిర్యాదులు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదు. పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే రైతులు రుణమాఫీ కాలేదని రోడ్డెక్కుతున్నారు. రైతు ప్రభుత్వమే ధ్యేయం పదేండ్లు బీఆర్ఎస్ పాలన కొనసాగింది. రైతులకు దన్నుగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు బాసటగా నిలిచి గ్రామాల వారీగా రుణమాఫీ కానీ రైతుల వివరాల సేకరణకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా మంగళవారం సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల ముఖ్యనేతలు సిద్దిపేట ఎమ్మెల్యే అధికారిక క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తలతో సన్నాహాక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మెదక్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు తదితరులు హాజరయ్యారు. గ్రామాల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరించాలని నిర్ణయించారు. గ్రామాల వారీగా బుధవారం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల వారీగా జాబితాలను రూపొందిస్తారు. రూపొందించిన జాబితాను పార్టీ అధిష్టానానికి అందజేస్తారు. ఆ తర్వాత పార్టీ కార్యాచరణకు అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

**పోలీసుల వలయంలో సిద్దిపేట ...**

సిద్దిపేట పట్టణంలో మంగళవారం బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ సభలతో భారీగా పోలీసులను మోహరించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సిద్దిపేట బ్లాక్ ఆఫీసు చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు, ప్రధాన కూడళ్లలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే అధికారిక క్యాంప్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు పార్టీల సభలతో మంగళవారం సిద్దిపేటలో టెన్షన్ వాతావరణం నెలకొంది. నాలుగు రోజుల కిందట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నేతలు దాడి చేసి ఫ్లెక్సీలు చించివేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఆరోజు నుంచి ఎప్పుడు ఏం జరుగుతుందోనని పట్టణ ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో రుణమాఫీపై సన్నాహాక సమావేశాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. అటు కాంగ్రెస్ నాయకులు రైతు రుణమాఫీ అభినందన ర్యాలీతో పాటు రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటలో ర్యాలీకి పిలుని చ్చారు. మల్కాజ్‌గిరీ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ తమ మద్దతు దారులతో సిద్దిపేటకు వచ్చారు. దీంతో రెండు పార్టీల సభలు సమావేశాలతో సిద్దిపేట పట్టణంలో ఒక్కసారిగా టెన్షన్ వాతావరణం ఏర్పడింది. బీఆర్ఎస్ శ్రేణులు వేలాదిగా తరలివచ్చి క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ తమ నేతలతో కార్యాచరణ సమావేశంలో పాల్గొన్నారు. అటు ఇతర ప్రాంతాల నుంచి కాంగ్రెస్ నేతలతో ర్యాలీకి ప్లాన్ చేసింది. బ్లాక్ ఆఫీసు చౌరస్తా నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీదుగా పాత బస్టాండ్ వరకు కాంగ్రెస్ ర్యాలీ తీయాలని తలిచింది. ఈ ర్యాలీ క్యాంపు కార్యాలయం మీదుగా పోతే గొడవ జరిగే అవకాశం ఉందని చెప్పి పోలీసులు కాంగ్రెస్ ర్యాలీ రూట్‌ను మార్చారు.అప్పటికే క్యాంప్ కార్యాలయం వైపు వెళ్లకుండా బారికేడ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు అటు వైపు వెళ్లే మార్గం పూర్తిగా బ్లాక్‌చేశారు. క్యాంప్ కార్యాలయం మీదుగా కాకుండా ఇతర మార్గం గుండా పాత బస్టాండ్ వరకు తీసుకుపోయారు. ఇటు బీఆర్ఎస్ నాయకులు క్యాంప్ కార్యాలయంలో తమ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రెండు పార్టీల సమావేశాలకు అంటకం కలగకుండా ఎవరి పరిధిలో వారు నిర్వహించుకునేలా పోలీసులు పక్కాగా ప్లాన్ చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. దీంతో పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# రుణమాఫీకి పోరాడుతాం

సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంపూర్ణ పంటరుణమాఫీ చేయలేదని పత్రాలను చూపుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట ప్రతినిధి/ సిద్దిపేట, ఆగస్టు 20(నమస్తే తెలంగాణ) : సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంపూర్ణ రుణమాఫీ సాధనకై జరిగిన కార్యాచరణ సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీనివాస్ మాట్లాడుతూ .. అందరు రైతులకు పంటరుణాల మాఫీ చేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. వందశాతం రుణమాఫీ కోసం పోరాడుతామన్నారు. సిద్దిపేటకు గొప్ప చరిత్ర ఉందని.. పౌరుషానికి, రేషానికి, త్యాగానికి సిద్దిపేట అడ్డా అన్నారు. ఉద్యమానికి, ఉద్యమకారులకు తెలంగాణ సాధించిన గడ్డ సిద్దిపేట అన్నారు. కాంగ్రెస్ కుటిల రాజకీయాలను తిప్పికొడతామన్నారు.

**ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**

## మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

**మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, మోసపూరిత వాగ్దానాలు, అబద్ధపు ప్రచారాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఎనిమిది నెలల్లో ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ పాలనలో రైతులకు 24 గంటల కరెంట్, ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడరన్నారు. హరీశ్‌రావు సవాల్‌తోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగి ఆగమేఘాల ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పి రూ.31 వేల కోట్ల రైతుల రుణాలకు కేవలం రూ.17 వేల కోట్లు రుణమాఫీ చేసి హరీశ్‌రావు రాజీనామా చేయాలని మాట్లాడడం హాస్యస్పదంగా ఉందన్నారు. రుణమాఫీ ఎంత మందికి రైతులకు అయిందో ఎమ్మెల్యేలు గ్రామాలకు వచ్చి చూస్తే తెలుస్తుందన్నారు. డిసెంబర్ 9కి ముందు లేని షరతులు ఇప్పుడెందుకు వచ్చాయన్నారు. మహిళలకు రూ.2500 మహాలక్ష్మి స్కీమ్ ఇస్తామని చెప్పి వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రశాంతంగా ఉన్న సిద్దిపేట వాతావరణాన్ని చెడగొట్టేందుకే సిద్దిపేటపై దండయాత్రకు వస్తున్నారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, తగిన గుణపాఠం చెబుతారన్నారు. సిద్దిపేటలో ప్రజలపై జరిగిన దాడిలో సీఎం హస్తం ఉందా.. అని ప్రశ్నించారు. సీఎం హస్తం ఉంటే రేపు జరగబోయే పరిణామాలకు సీఎం రేవంత్‌రెడ్డే బాధ్యత వహించాలని పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంపూర్ణరుణమాఫీ సాధన కార్యాచరణలో బీఆర్ఎస్ నాయకులు

## హామీలు అమలు చేయమంటే దాడులు చేస్తారా..

**మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్**

ఇచ్చిన హామీలు అమలు చేయమంటే ప్రతిపక్ష నాయకులపై దాడులు చేస్తారా అని మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ ప్రశ్నించారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంపై దాడి యావత్తు తెలంగాణపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. హరీశ్‌రావు ఒత్తిడి వల్లనే రైతు రుణమాఫీని ప్రభుత్వం చేసిందన్నారు. అన్ని విషయాలను ప్రజల ముందు పెడుతున్నారనే అక్కసుతోనే రాజీనామా పేరిట దాడులు చేస్తున్నారని ఆరోపించానేజ ప్రతి ఒక్క రైతుకూ రుణమాఫీ చేసేదాకా ప్రభుత్వం వెంటబడుతామన్నారు. రేవంత్‌రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లిలో సంపూర్ణ రుణమాఫీ అయిందని నిరూపిస్తే రాజీనామాలకు సిద్ధమన్న బీఆర్ఎస్ సవాల్‌ను సీఎం రేవంత్ రెడ్డి స్వీకరించలేదన్నారు. నాడు తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు మైనంపల్లి చేసిన దాడిని ఇంకా మరిచిపోలేదని.. సిద్దిపేట ఉద్యమకారుల అడ్డా అన్నారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట పోలీసుల బందోబస్తు

## వంద కార్లతో వస్తే భయపడం

**ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

మైనంపల్లి హన్మంతరావు వంద కార్లతో వస్తే భయపడే వారు ఎవరూ లేరని, నీవు పోరాటం చేయాల్సింది సీఎం రేవంత్‌రెడ్డిపై అన్నారు. కేసీఆర్ మెదక్‌కు మెడికల్ కళాశాల, రింగ్‌రోడ్డుతో పాటు అభివృద్ధి పనులకు వెయ్యి కోట్ల రూపాయలు కేటాయిస్తే రేవంత్‌రెడ్డి వాటన్నింటినీ రద్దు చేశారని.. మెదక్ ఎమ్మెల్యేగా ఉన్న నీ కొడుకు రోహిత్, నువ్వు రేవంత్‌రెడ్డిపై పోరాటం చేయాలన్నారు. మెడికల్ కళాశాలను కొడంగల్‌కు తరలించుకుపోతే అడిగే దిక్కు లేదన్నారు. రైతు రుణమాఫీని డైవర్ట్ చేసేందుకు మంత్రి పదవి కోసం మైనంపల్లి ఆడుతున్న హైడ్రామా అన్నారు. సిద్దిపేట గడ్డ తెలంగాణను తీసుకవచ్చిన గడ్డ అన్నారు. వేల ఎకరాలకు సాగు నీరందించిన ఘనత కేసీఆర్, హరీశ్‌రావులది అన్నారు. ప్రాజెక్టులకు కాళేశ్వరం నుంచి నీళ్లు వదలాలని హరీశ్‌రావు గట్టిగా నిలదీస్తేనే నేడు ప్రాజెక్టులకు నీళ్లు వదులుతున్నారన్నారు. 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని మంత్రులు అంటున్నారన్నారు. ఎవరు చెప్పే మాట నిజమని ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు.

# పెండింగ్ పనులు పూర్తిచేయాలి

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరితో కలిసి హుస్నాబాద్‌లో సుడిగాలి పర్యటన

హుస్నాబాద్, ఆగస్టు 20: హుస్నాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కలిసి హుస్నాబాద్ పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. మినీస్టేడియం, బాలురు, బాలికల ఉన్నత పాఠశాల, నిర్మాణంలో ఉన్న పలు ప్రభుత్వ భవనాలను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మినీ స్టేడియంలో పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్ఫినిటీ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్, రోబోటిక్ లాబ్‌లు ఒక్కోటి రూ.50లక్షలతో ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హుస్నాబాద్‌లో శిల్పారామం, రవీంద్రభారతి లాంటి ఆడిటోరియం నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా మహిళా క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. మినీ స్టేడియంలో స్విమ్మింగ్ పూల్‌తో పాటు కబడ్డీ, ఖోకో, వాలీబాల్ కోర్టులు కూడా ఏర్పాటు చేయాలని, ఆయా క్రీడల్లో నిత్యం శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న వెజ్, నాన్‌వెజ్ భవన నిర్మాణం వెంటనే పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, కౌన్సిలర్లు, ఆర్డీవో రామ్మూర్తి, కమిషనర్ మల్లికార్జున్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య తదితరులు పాల్గొన్నారు.